"మధురమైన పిల్లలూ - మీరు తండ్రిని స్మృతి చేసే రేస్ చేయాలి, తండ్రిని మర్చిపోతే మాయ బాంబు తగులుతుంది"

ప్రశ్న:- ఈ డ్రామాలోని ఏ గుహ్యమైన రహస్యాల గురించి పిల్లలైన మీకు మాత్రమే తెలుసు?

జవాబు:- 1. ఈ డ్రామాలో భిన్న-భిన్న వెరైటీ నటులు ఉన్నారని, ప్రతి ఒక్కరికీ వేర్వేరు పాత్ర ఉందని, ఒకరి పాత్ర, ముఖ కవళికలు మరొకరితో కలవవని మీకు తెలుసు. ఎవరైతే ఆల్రౌండ్ హీరో పాత్రధారులుగా ఉన్నారో, వారికే మహిమ ఉంది. ఇకపోతే ఎవరైతే ఒకటి లేక రెండు జన్మలు పాత్రను అభినయిస్తారో, వారు బలహీన పాత్రధారులు. 2. పాత్రధారులందరిలోనూ పరమాత్మ వ్యాపకుడై ఒంటరిగా అతనే నాట్యం చేయరు! వారు ఈ అనంతమైన డ్రామాకు డైరెక్టర్, వారు నామ-రూపాలకు అతీతుడు కాదు. ఒకవేళ వారు అతీతుడైనట్లయితే - మీ గతి-మతము మీకే తెలుసు... అని అనడము తప్పవుతుంది.

ఓంశాంతి. నేను సాధారణ వృద్ధ తనువులోకి వస్తాను అనగా ఎవరైతే వానప్రస్థావస్థకు చేరుకున్నారో వారిలోకి వస్తాను అని తండ్రి అంటారు. వానప్రస్థము అనగా వాణి నుండి అతీతము, అది నిర్వాణధామము. సుఖధామము, దుఃఖధామము అనగా మనుష్యులుండే స్థానము. సుఖధామములో మనుష్యులు ఉంటారు. అక్కడ వారికి సుఖం లభిస్తుంది కావున దానికి సుఖధామము అన్న పేరు పెట్టారు. ధామము అనగా నివసించే స్థానము. అచ్ఛా, శాంతిధామము అని అంటారు. అక్కడ మనుష్యులు ఉండరు. శాంతిధామము అని అనడము ద్వారా అక్కడ ఆత్మలు ఉంటారు అని నిరూపించబడుతుంది. అక్కడ మనుష్యులు ఉండజాలరు. మనుష్యులు సత్యయుగంలో శాంతిగా ఉంటారు అంటే ఏదో గుహలలో ఉంటారనో లేక మనసును నిస్సంకల్పంగా చేస్తారనో కాదు. అక్కడ ఉండేదే ఒక్క అద్వైత ధర్మము, ద్వైతము యొక్క విషయము ఉండదు. ఆ తర్వాత ఎన్ని ధర్మాలైతే పెరుగుతూ ఉంటాయో అంతగా ద్వైతము పెరుగుతూ ఉంటుంది, ఎక్కడైతే ద్వైతము ఉంటుందో అక్కడ అశాంతి ఉంటుంది. నిర్వాణధామాన్ని వానప్రస్థము అని అంటారు. ఆత్మలమైన మనము నిర్వాణధామంలో ఉంటామని ఇప్పుడు పిల్లలైన మీకు తెలిసింది, దానిని ముక్తిధామము అని అంటారు. అక్కడ శాంతిలో కేవలం ఆత్మలే ఉంటాయి. సుఖధామములోనైతే శరీరాలు ఉంటాయి కదా. శరీరములో ఉన్నప్పుడు ఎప్పుడూ శాంతి ఉండదు. మనుష్యులు హఠయోగము, ప్రాణాయామము మొదలైనవి చేస్తూ 10-20 రోజులు లేక ఒక మాసము కూడా అలాగే ఉండిపోతారు. కానీ అలా ఎంతవరకు శాంతిగా ఉండగలరు? ముక్తి-జీవన్ముక్తులలోకైతే వెళ్ళలేరు. ఇది డ్రామా కదా. ఈ సమయంలో ఆత్మలందరూ ఇక్కడ కర్మ క్షేత్రములోకి వచ్చి తీరాలి ఎందుకంటే నంబరువారుగా రావలసి ఉంటుంది. ఆత్మలు కూడా నంబరువారుగా ఉన్నారు కదా. కొందరు సతోప్రధానముగా ఉన్నారు, కొందరు సతోగా, రజోగా, తమోగా ఉన్నారు. ఎవరైతే చివర్లో కొద్దిగా పాత్రను అభినయిస్తారో, వారు బలహీన ఆత్మలు. వారికి చాలా కొద్ది పాత్ర మాత్రమే ఉంటుంది. వారి ప్రభావము అంతగా ఉండదు, వారు అంతగా మహిమ చేయబడరు. ఎవరెవరు మహిమ చేయబడతారో ఆలోచించండి. ఉన్నతోన్నతమైనవారు భగవంతుడు. ఇది భారత్ యొక్క విషయము. వేరే స్థానాలలో ఎవరి మహిమను చేయాలి? ధర్మ స్థాపకులను. ఏ విధంగానైతే క్రైస్ట్ ఉన్నారు, ఆ తర్వాత పోప్ లు వస్తారు. వారి చిత్రాలు కూడా ఉన్నాయి. ఏ ఆత్మలకైతే మహిమ జరుగుతుందో, వారికి గొప్ప పాత్ర ఉంటుంది. పిల్లలైన మీరు సృష్టి ఆదిమధ్యాంతాలను తెలుసుకున్నారు. డ్రామాలో ఫస్ట్ క్లాస్ పాత్రధారులు ఎవరు. ఇది వార్తాపత్రికల్లో వేసినప్పుడు కూడా ఫలానావారిని చూడాలి అని మనుష్యులకు ఆకర్షణ కలుగుతుంది. ఇది 5000 సంవత్సరాల అనంతమైన డ్రామా అని ఎవరికీ తెలియదు. విదేశాలవారు కూడా చాలా ప్రగల్భాలు పలుకుతారు. అందరికన్నా ఎక్కువగా ఇక్కడి వారు ప్రగల్భాలు పలుకుతూ ఉంటారు. కావున తండ్రి వచ్చి మనకు జ్ఞానమంతా ఇస్తారు. మీ బుద్ధిలో ఇది తప్పకుండా కూర్చోవాలి. ముఖ్యమైన క్రియేటర్, డైరెక్టర్, ప్రిన్సిపాల్ యాక్టర్ ఎవరు? శివబాబా. వారే జ్ఞాన సాగరుడు, ఆనంద సాగరుడు. మనం శివబాబాను పాత్రధారి అని అనవచ్చు. వారెప్పుడూ పాత్రను అభినయించరు, వారు నామ-రూపాలకు అతీతుడు అని మనుష్యులంటారు, మళ్ళీ వారు సర్వవ్యాపి అని కూడా అంటారు. అలా అయితే అందరిలోనూ నాట్యం చేసే నటుడు వారొక్కరేనా? అలా కాదు. ప్రతి ఒక్కరి పాత్ర వేర్వేరు. ఒకరిది మరొకరితో కలవదు. ఎంతోమంది మనుష్యులున్నారు, ఒకరి ముఖకవళికలు మరొకరితో కలవవు. ఈ ప్రపంచ డ్రామా ఉన్నది ఉన్నట్లుగా రిపీట్ అవుతూ ఉంటుందని పిల్లలకు తెలుసు. మళ్ళీ గీతా జ్ఞానాన్ని వినిపించవలసి వచ్చింది అని మీ వద్ద పాట కూడా ఉంది. తండ్రి అంటారు, నేను మీకు ఎన్నిసార్లు ఈ జ్ఞానాన్ని వినిపిస్తాను! నేను, మీరు మరియు ఈ ప్రపంచమంతా ఇప్పుడూ ఉంది, కల్పక్రితము

కూడా ఉంది. కల్ప-కల్పము మళ్ళీ కలుసుకుంటూ ఉంటాము. వేరే ఏ ప్రపంచమూ ఉండదు. తండ్రి అంటారు, నేను ఒక్కడినే కావున రచన కూడా ఒక్కటే. భగవంతుడు ఒక్కరే. వేరేవారి నామరూపాలే లేవు. ఉన్నతోన్నతమైనవారు ఒక్క శివబాబా మాత్రమే. మళ్ళీ త్రిమూర్తి బ్రహ్మ అని అంటారు. త్రిమూర్తులలో బ్రహ్మను ఎక్కువగా చూపిస్తారు. త్రిమూర్తి శంకర అని అనరు. దేవ దేవ మహాదేవ అని కూడా అంటూ ఉంటారు. మొదట బ్రహ్మ వస్తారు, ఈ ముగ్గురు దేవతలలో నంబరువన్ బ్రహ్మ. బ్రహ్మనే గురువు అని అంటారు. శంకరుడిని లేక విష్ణువుని గురువు అని అనరు. త్రిమూర్తులలో ముఖ్యమైనవారు బ్రహ్మ. ఆ సూక్ష్మవతనవాసి అయితే సంపూర్ణ బ్రహ్మ. ముఖకవళికలైతే ఒకే విధంగా ఉంటాయి. ఉన్నతోన్నతమైనవారు శివబాబా, వారు అందరికీ బాబా, ఆ తర్వాత గ్రేట్ గ్రేట్ గ్రాండ్ ఫాదర్ అని అంటూ ఉంటారు. వారి నుండి మనుష్య సృష్టి రూపీ వంశవృక్షం వెలువడుతుంది. ఇది మనుష్య సృష్టి రూపీ వృక్షము. మొట్టమొదట ఆడమ్ అనగా ఆదిదేవ్ మరియు ఆదిదేవి ఉంటారు, వారి ద్వారా రచనను రచిస్తారు. కానీ, అందరూ ఏమైనా బ్రహ్మకుమార-కుమారులుగా అవుతారా. ఎవరైతే బ్రాహ్మణులుగా అవుతారో, వారే తర్వాత దేవతలుగా అవుతారు. ఇది చదువు. యజ్ఞములో కావాల్సింది కూడా బ్రాహ్మణులే. ఆ బ్రాహ్మణులు స్థూల యజ్ఞాలను రచించేవారు. మీ యజ్ఞము ఆత్మికమైనది. వారి యజ్ఞము కొంత సమయం నడుస్తుంది, అక్కడ చివర్లో నువ్వులు, నెయ్యి మొదలైనవాటిని ఆహుతి చేస్తారు. ఇది చాలా భారీ యజ్ఞము, ఇందులో మొత్తం ప్రపంచమంతా స్వాహా అవ్వనున్నది. సత్య, త్రేతా యుగాలలో ఎప్పుడూ యజ్ఞాలు జరగవు. ఆ యజ్ఞాలను విపత్తులను తొలగించడానికి రచిస్తారు. విపత్తులు ద్వాపరము నుండి మొదలవుతాయి. తండ్రి అంటారు, ఈ యజ్ఞము తర్వాత మళ్ళీ అర్ధకల్పము ఏ యజ్ఞాలు జరగవు. అంతా అర్థం చేయించడం జరుగుతుంది, ఇప్పుడు రైట్ ఎవరో మీరే నిర్ణయించండి. ఈ చిన్న-చిన్న యజ్ఞాలన్నీ హద్దులోనివి. ఇది అనంతమైన యజ్ఞము. ఈ యజ్ఞంలో మొత్తం ఆహుతి అవుతుంది. ఇక తర్వాత అర్ధకల్పము ఏ యజ్ఞాలూ ఉండవు. పూజ కోసం ఏ మందిరాలూ ఉండవు. మందిరాలు భక్తి మార్గంలోనే తయారవుతాయి. ఉన్నతోన్నతమైన శివబాబాను భక్తులందరూ తలచుకుంటారు. కానీ పరిచయము లేని కారణంగా తెలియదు, తెలియదు అని అంటూ ఉంటారు. రచన మరియు రచయిత యొక్క అంతమును మేము పొందలేము అని అంటారు. మళ్ళీ భగవంతుడా, నీ గతి-మతము అతీతమైనవి, అవి మీకే తెలుసు అని గానం చేస్తారు. తప్పకుండా ఎవరో ఉన్నారు కావుననే కదా మీకే తెలుసు అని గానం చేస్తారు. వారు తప్పకుండా నామ-రూపాలు కలవారై ఉంటారు, కావుననే ఓ భగవంతుడా, మీ గతి-మతము అతీతమైనవి అని అంటారు. కానీ మనుష్యులకు దీని అర్థము తెలియదు. తండ్రి అర్థం చేయిస్తారు, నా మతము అన్నింటికన్నా అతీతమైనది. మిమ్మల్ని శూద్రుల నుండి బ్రాహ్మణులుగా చేసి, ఆ తర్వాత శ్రేష్ఠమైన దేవతలుగా తయారుచేస్తాను. నేను జీవన్ముక్తి దాతను. నేను సర్వుల ముక్తిదాతను. కలియుగం పూర్తయి మళ్ళీ సత్యయుగం వస్తుంది. సత్యయుగంలో దుఃఖం యొక్క విషయము ఉండదు. తండ్రి ఇప్పుడు దుఃఖము నుండి విముక్తులుగా చేస్తారు, మిగిలినవారంతా శాంతిధామానికి వెళ్ళిపోతారు. కలియుగాంతములోనే ముక్తిదాత వస్తారు. వారు వచ్చి నరకాన్ని స్వర్గముగా చేస్తారు, ఇక్కడైతే చాలా దుఃఖము ఉంది, దీనిని స్వర్గము అని అనలేరు. పాత ప్రపంచాన్ని కొత్త ప్రపంచము అని ఏమైనా అంటారా. కొత్త ప్రపంచములో లక్ష్మీ-నారాయణుల రాజ్యము ఉండేది. పాత ప్రపంచములో ఏముంది. ఇది మళ్ళీ కొత్త ప్రపంచముగా అవుతుంది. ఉన్నతోన్నతమైన బాబాయే వచ్చి పాత ప్రపంచాన్ని కొత్త ప్రపంచముగా చేస్తారు. సూక్ష్మవతనవాసులైన బ్రహ్మ, విష్ణు, శంకరులను దేవతలు అని అంటారు. ప్రజాపిత బ్రహ్మ సూక్ష్మవతనవాసి అని ఎక్కడా కూడా రాసి లేదు. సూక్ష్మవతనములో ఏమైనా ప్రజలు ఉంటారా. ప్రజాపిత బ్రహ్మ అయితే తప్పకుండా ఇక్కడే కావాలి. ఉన్నతోన్నతమైనవారు శివబాబా. ఆ తర్వాత రెండవ నంబరులో బ్రహ్మ ఉన్నారు. శివబాబా ఈ బ్రహ్మ ద్వారా కూర్చొని సేవ చేస్తారు, బ్రాహ్మణులను దేవతలుగా తయారుచేస్తారు. ఇది ఉన్నదే పాపాత్ముల ప్రపంచము, రావణ రాజ్యము. ఏదైతే చేస్తారో దాని వలన మనుష్యుల ద్వారా పాపాలే జరుగుతాయి, ఇక్కడ భ్రష్టాచారులతోనే ఇచ్చి పుచ్చుకోవడాలు జరుగుతాయి. భ్రష్టాచారము ద్వాపరము నుండి మొదలవుతుంది. మళ్ళీ అంతిమంలో తండ్రి వచ్చి మహాన్ శ్రేష్ఠాచారులుగా తయారుచేస్తారు. కళలు తగ్గిపోవడానికి 5000 సంవత్సరాలు పడతాయి. ఎవరైతే శ్రేష్ఠాతి శ్రేష్ఠమైన దేవతలుగా ఉండేవారో, వారే మళ్ళీ కిందకు దిగుతారు. ఈ ఆటే ఈ విధంగా ఉంటుంది. తండ్రి ఎంత మంచి రీతిలో కూర్చుని అర్థం చేయిస్తారు. ఎవరైనా కూర్చుని అర్థం చేసుకుంటే మంచి రీతిలో అర్థం చేసుకోగలుగుతారు. మీరు కరాచీలో భట్టీలో ఉండేవారు, అర్థం చేసుకునేందుకు వస్తూ ఉండేవారు. పార్టిషన్ తర్వాత అందరూ పారిపోయారు, మీరు అక్కడే ఉన్నారు. మీకు ఎవరి సాంగత్యమూ ఉండేది కాదు. సాంగత్యానికి దూరంగా ఉంటూ కూడా నంబరువారుగా పురుషార్థం చేసారు. అందరూ ఒకే విధమైన పురుషార్థము చేయలేరు కూడా. స్కూల్లో కూడా అందరూ ఒకే విధమైన నంబరు తీసుకోరు. ఇద్దరు విద్యార్థులకు 99 మార్కులు లభించలేవు. క్లాసులో ఏమైనా ఒకరిపై ఒకరు కూర్చుంటారా. గుర్రాల రేస్ కూడా ఉంటుంది. అందులో కూడా ఏ రెండూ ఒకే విధంగా ఉండలేవు. దీనికి రాజస్వ అశ్వమేధ అన్న పేరును పెట్టారు, అశ్వము అని గుర్రాన్ని అంటారు, మీరు

ఆత్మిక గుర్రాలు. ఇప్పుడు మీ పరుగు ఇంటి వైపుకు ఉంది. తండ్రి వద్దకు నేను మొదట చేరుకోవాలి అని అంటూ మీ పరుగు ఇంటి వైపుకు ఉంది. అక్కడైతే వారు సైకిళ్ళు, గుర్రాల యొక్క రేస్ లు చేస్తారు. యుద్ధాల రేస్ కూడా ఉంటుంది. మీది యుద్ధానికి యుద్ధము కూడా మరియు రేస్ కు రేస్ కూడా. మీది మాయపై విజయాన్ని పొందేందుకు చేసే యుద్ధము మరియు తండ్రిని స్మృతి చేయమని చెప్పడము జరుగుతుంది. గురునానక్ ను స్మృతి చేయండి లేక ఇంకెవరినైనా స్మృతి చేయండి అని చెప్పడము జరగదు. సర్వుల సద్గతిదాత ఒక్కరే. వాస్తవానికి సర్వులపై దయ చూపించేవారు కూడా ఒక్కరే. సర్వుల సద్గతిదాత, పతిత-పావనుడు కూడా ఒక్కరే. కానీ వాళ్ళు ఆ పేరును స్వయానికి పెట్టుకున్నారు కావున అది అసత్యమైనట్లు కదా. సర్వులకు సుఖము ఇచ్చేవారు ఒక్కరే. సుఖధామములోకి కూడా తండ్రే తీసుకువెళ్తారు. కావున తండ్రి నుండే సుఖధామం యొక్క వారసత్వాన్ని తీసుకోవాలి. అర్ధకల్పము రావణుడు శాపాన్ని ఇచ్చాడు. ఇప్పుడు తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకోండి. ఇది ఉన్నదే పాపాత్ముల ప్రపంచము. దేవతలది పుణ్యాత్ముల ప్రపంచము. పాపపు ప్రపంచములో పుణ్యము ఉండదు. ఫలానావారు మరణించారు, స్వర్గస్థులయ్యారు అని వీరు ప్రగల్భాలు పలుకుతారు. అరే, అసలు స్వర్గమే లేనప్పుడు స్వర్గములో జన్మ ఎలా లభించగలదు. ఇది కూడా అర్థం చేసుకునేవారే అర్థం చేసుకుంటారు. అర్థం చేసుకునేందుకు ఇక్కడే కూర్చోవాల్సిన అవసరమేమీ లేదు. విదేశాలలో ఉంటే ఉండండి కానీ ఏడు రోజులు బాబా సాంగత్యములో తప్పకుండా ఉండవలసి ఉంటుంది ఎందుకంటే సత్సాంగత్యము తీరానికి చేరుస్తుంది, చెడు సాంగత్యము ముంచేస్తుంది. ఒకవేళ బాణం తగిలితే ఇంకా ఏడు రోజులు ఉంటాము అని అంటారు. అప్పుడు బాబా ఏ పరీక్ష తీసుకుంటారంటే - తండ్రి చదివిస్తున్నారని పూర్తి నిశ్చయముందా, మనసు నిమగ్నమవుతుందా, బాణం తగులుతుందా? అరే, తండ్రి వద్దనైతే ఉండాలి కదా. ఎప్పుడైతే ఈ రంగు పక్కాగా అంటుకుంటుందో, అప్పుడిక విదేశాలకైనా వెళ్ళవచ్చు. ఇప్పుడు పవిత్రంగా అయినట్లయితే 21 జన్మలకు రాజ్యము లభిస్తుంది. ఇదేమైనా తక్కువ విషయమా? ఒక్క జన్మ పవిత్రంగా అవ్వండి, ఇదేమైనా పెద్ద విషయమా. బాబా యుక్తులనైతే ఎన్నో తెలియజేస్తారు. ఎవరితోనూ గొడవ జరగకుండా ఉండేలా, స్నేహం కూడా నిలిచి ఉండేలా, తమను తాము కూడా విడిపించుకుంటూ ఉండేలా మెల్ల-మెల్లగా యుక్తిగా నడుచుకోండి. బాబా యుక్తులను తెలియజేసేవారు కావున ఇలా-ఇలా చేయండి అని యుక్తి చెప్తారు. చాలామంది కుమార్తెలు భూ-భూ చేసి పతిని తీసుకొస్తారు. అప్పుడు ఆ పతి - ఈమె నన్ను రక్షించారని ఆ స్త్రీ చరణాలపై పడతారు. ఆ బ్రాహ్మణులైతే వికారాల బంధాన్ని జోడిస్తారు. ఇక్కడ బ్రహ్మ మరియు బ్రాహ్మణులు పవిత్రత యొక్క బంధాన్ని జోడిస్తారు, వికారాల బంధాన్ని క్యాన్సల్ చేస్తారు. పిల్లలు అంటారు కూడా - బాబా, మీరు మమ్మల్ని స్వర్గములోకి తీసుకువెళ్తారు, మీరు చెప్పింది మేము ఎందుకు వినము! సంతోషముగా పవిత్రత యొక్క కంకణాన్ని కట్టుకుంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. పవిత్రముగా అయ్యే యుక్తిని మీకు మీరే రచించాలి. 21 జన్మల రాజ్యము కొరకు పవిత్రత యొక్క ప్రతిజ్ఞను చేయాలి.

2. శ్రేష్ఠాతి-శ్రేష్ఠముగా అయ్యేందుకు శ్రేష్ఠాచారులతో ఇచ్చిపుచ్చుకోవడాలు చేయాలి. తండ్రి సాంగత్యములో ఉంటూ నిర్భయులుగా అవ్వాలి.

వరదానము:- సర్వశక్తివంతుని తోడు యొక్క స్మృతి ద్వారా సదా సఫలతను అనుభవం చేసే కంబైండ్ రూపధారి భవ

సర్వశక్తివంతుడైన తండ్రిని మీ సహచరునిగా చేసుకున్నట్లయితే శక్తులు సదా తోడుగా ఉంటాయి. మరియు ఎక్కడైతే సర్వ శక్తులు ఉంటాయో, అక్కడ సఫలత ఉండకపోవడమనేది అసంభవము. కానీ ఒకవేళ తండ్రితో పాటు కంబైండ్ గా ఉండడంలో లోపముంటే, మాయ కంబైండ్ రూపాన్ని వేరు చేస్తుంది, అప్పుడు సఫలత కూడా తగ్గిపోతుంది, శ్రమించిన తర్వాత సఫలత లభిస్తుంది. మాస్టర్ సర్వశక్తివంతులకు సఫలత అనేది వారి చుట్టూ తిరుగుతూ ఉంటుంది.

స్లోగన్:- అందరి ఆశీర్వాదాలు తీసుకోవాలంటే హాజీ (సరేనండి) అని అంటూ సహయోగం యొక్క చేతిని అందిస్తూ వెళ్ళండి.